విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

హోదా కోసం ఆమరణ దీక్ష

విశాలాంధ్ర, తాడేపల్లిగూడెం: ప్రత్యేక హోదా కోసం సామాన్యుడు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టాడు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్ (బివిఆర్ కళా కేంద్రం) వద్ద గత రెండు రోజులుగా నిరాహార దీక్ష కుసంపుడి విజయ్ చేపట్టారు. దీక్ష శిబిరం వద్ద గుండు కొట్టించుకొని, అక్కడే స్నానం చేసి గాంధీ వేషధారణతో ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. పార్టీలకు అతీతంగా నాయకులు, నిరుద్యోగ యువత స్టూడెంట్స్, వ్యాపారులు, పలు సంఘాల నుంచి మద్దతు లభిస్తున్న, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో చలనం లేదని కుసంపుడి విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర రాష్ట్రం కోసం నా ప్రాణమైన అర్పిస్తానని ఆదివారం నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చలనం కోసం ఆమరణ నిరాహార దీక్షకు దిగుతున్నానని విజయ్ తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క నాయకులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కట్టానాగరాజు, నేధురి గంగాధర్, పిల్ల చిన్న పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర -భీమవరం: సావిత్రి భాయి పూలే స్ఫూర్తితో మహిళలు ముందుకు సాగాలని సంపూర్ణ విద్యతోనే మహిళలకు స్వాతంత్ర్యం అని నమ్మి మహిళలకు పాఠశాలలు స్థాపించి ఉద్యమించిన సావిత్రిభాయిపూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిఎస్ఎం గరల్స్ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు కె.శ్రావణి, మల్లువలస భాగ్యలక్ష్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో సంఘ సంస్కర్త సావిత్రిభాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం భీమవరంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా నాగరికత ప్రపంచంలోకి రావాలని, మహిళా శక్తి పరాశక్తి అని అన్నారు. భావితరాలలో అందరూ కూడా ఆనాటి మహనీయులను స్మరించుకోవాలని అన్నారు. డీఎన్నార్ కళాశాల అధ్యాపకులు చెల్లబోయిన రంగారావు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సంఘ సంస్కర్త సావిత్రిభాయి పూలే ఆనాడు స్త్రీ విద్య కోసం ఉద్యమించిన అవమానాలు పాలైయ్యారని, నేడు ఆమె ఆశయాలు మహిళల్లో సంపూర్ణ విద్యతో ముందుంటున్నారని అన్నారు. అనంతరం ఇరువురు ఉపాధ్యాయులు శ్రావణి, భాగ్యలక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో కలిగొట్ల గోపాల శర్మ, అరసవల్లి సుబ్రమణ్యం, గంటా సుందర్ కుమార్, పి అమూల్య రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: యామిని

విశాలాంధ్ర - వేలేరుపాడు: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని ఆకాంక్షించారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య మండల కార్యదర్శి కరటం సీతామహాలక్ష్మి అధ్యక్షతన ఆదివారం మహిళా సమాఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఐ కార్యాలయం నుండి వేలేరుపాడు ప్రధాన కూడలి వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మన్నవ యామిని మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ విశిష్టతను, పోరాటాలు చేసి సాధించిన ఘనతను సుదీర్ఘంగా తెలియజేశారు. మహిళలు ఇంకా సాధించాల్సింది ఎంతో ఉందన్నారు. మహిళలపై రోజు రోజుకి అరాచకత్వం, దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. మహిళల రక్షణ కొరకు అనేక చట్టాలు తీసుకొచ్చిన అవి అమలులో ఏమాత్రం పటిష్టత లేకపోవడం వలన దాడులు పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వాలు పట్టీ పట్టనట్లు వ్యవహరించటం వలనే సమాజంలో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించగలిగిననాడే వ్యవస్థలో మార్పు వస్తుందన్నారు. మహిళలు ఐక్యతగా పోరాటాలు చేసిన నాడు మార్పు వస్తుందన్నారు. మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, మహిళలపై దాడులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైందని దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న వారిని గెలిపించాలన్నారు. నిరంతరం సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కారం కుమారి, మడకం దేశమ్మ, బాడిస అనంతలక్ష్మి, పిట్టా జయ, కారం రాజమ్మ, సరియం విమల, భద్రకేలి, సోడే చిన్నమి, బంధం రాజమ్మ, దేశమ్మ, బంధం సీత పాల్గొన్నారు.

20 ఏళ్ల కల నెరవేరింది

జగన్నాథపురంలో 169 మందికి పట్టాలు

విశాలాంధ్ర- ద్వారకాతిరుమల : రాష్ట్రహోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత చొరవతో చెలికాని రాజబాబు ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల మండలం ఐఎస్.రాఘవాపురం రెవిన్యూ పరిదిలోని జగన్నాథపురం పంచాయితిలో 169 మంది పేదరైతులకు అసైన్డ్ పట్టాలు మంజూరు కానున్నాయి. గత 20ఏళ్ళుగా జగన్నాథపురం గ్రామంలోని ఆర్.ఎస్.నెం.425లో 115ఎకరాల ప్రభుత్వభూమిని 169మంది నిరుపేద రైతులు ఆక్రమణ చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. భూములకు పట్టాలు లేక ఎలాంటి లబ్ది కలుగడం లేదు. రుణాలు, ప్రభుత్వ ప్రోత్సహకాలు, పథకాలు అందడం లేదు. ఇంతవరకు తమను ఏప్రభుత్వము పట్టించుకోలేదని, 2014లో మండల కేంద్రంలో వారం రోజులపాటు ధర్నా నిర్వహించినా న్యాయం జరగలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం 10రోజుల కాల వ్యవదిలో మంత్రి తానేటి వనిత చొరవతో పట్టాలు పొందడం ఆనందంగా ఉందని లబ్దిదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గం వైకాపా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తానేటి వనితను ప్రకటించడంతో గత 45రోజులుగా మండలంలోని ప్రతిగ్రామంలోను మంత్రి పర్యటిస్తున్నారు. గత 10రోజుల క్రితం జగన్నాథపురం రైతులు తమకు అన్ని అర్హతలు ఉన్నా తమ అదీనంలో ఉన్న అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడం లేదని తమకు న్యాయం చేయమని మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి పార్టీలకు అతీతంగా నిజమైన లబ్ధిదారులందరికి న్యాయం జరిగేలా రెవిన్యూ అధికారులతో సమగ్ర సర్వే నిర్వహించి యుద్ధప్రాతిపదికన పనులు చేయించి లబ్ధిదారుల పేర్లు ఆన్‌లైన్ చేయించారు. ఒకటి రెండు రోజుల్లో పట్టాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహిళల స్వావలంబన కోసమే వైఎస్ఆర్ చేయూత

విశాలాంధ్ర - కైకలూరు : మహిళల సంక్షేమ, అభివృద్ధి, పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ,సంక్షేమమే ప్రభుత్వం సాగిస్తున్నారని అన్ని వర్గాల ప్రజలకు వివిధ పథకాల ద్వారా డబ్బులను అందిస్తూ వారి ఆర్థిక భరోసాకు చేయూత నిస్తున్నారని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆశయంతో వైఎస్సార్ చేయూతను తీసుకొచ్చి ఏటావారి అకౌంట్లో డీబీటీ ద్వారా డబ్బులు జమ చేస్తు ఈ 4విడుతలల్లో ఒక్కరికి 75 వేల రూపాయలు జమ చేసారని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ తో కలిసి ఆటపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరిగిన 4వ విడత వైస్సార్ చేయూత విడుదల కార్యక్రమంలో పాల్గొని 8 కోట్ల 67 లక్షల 98 వేల రూపాయలు నమూనా చెక్కును అందజేశారు. జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా సేవలు అందిస్తున్న జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అడవి వెంకట కృష్ణ మోహన్, కురేళ్ళ బేబీ, చేబోయిన వీర్రాజు, కొల్లాటి సత్యనారాయణ, భట్రాజు శివాజీ, సయ్యపురాజు గుర్రాజు, చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్ తలారి మణిమ్మ, దానం మేరీ నవరత్న కుమారి,ఎండిఓ,ఏపిఎంలు,వెలుగు మిత్రా సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీతో జతకట్టడం అవకాశవాదమే

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - గణపవరం: విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దగా చేసిన బీజేపీతో టీడీపీ, జనసేన పార్టీలు జట్టు కట్టడం పచ్చి అవకాశవాదమని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆదివారం గణపవరం కన్యకాపరమేశ్వరి వర్తక సంఘం భవనంలో జరిగిన సీపీఐ గణపవరం శాఖ సమావేశంలో భీమారావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో వున్న వైసీపీ, ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి బీజేపీకి దాసోహం చేయడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమన్నారు. జగన్, చంద్రబాబు తమపై వున్న కేసులు భయంతో రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించి బీజేపీతో అంటకాగుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును ఫణంగా పెట్టి రాష్ట్రానికి తీరని ద్రోహం తలపెడుతున్నారన్నారు. అవకాశ వాదంతో స్వార్థపూరిత రాజకీయాలతో పనిచేస్తున్న టీడీపీ,జనసేన, బీజేపీ, వైసీపీ పార్టీలను చిత్తుగా ఓడించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణం గా ఏపీకి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలుకు నిరంతరం ఉద్యమిస్తున్న వామపక్షాలు, కాంగ్రెస్, సెక్యులర్ పార్టీలతో కూడిన ఇండియా కూటమిని ఆదరించాలని భీమారావు కోరారు.

గత పదేళ్ళలో దేశానికి చేసిన అభివృద్ధిని చూపి ఓట్లడిగే దుమ్ము లేక ప్రధాని నరేంద్ర మోదీ అయో ధ్యలో రామాలయం నిర్మాణం పేరుతో మతతత్వాన్ని రెచ్చగొట్టి తిరిగి అధికారంలోకి రావాలనే దుర్మార్గపు చర్యలకు పూనుకుంటున్నారన్నారు. ధరల తగ్గిస్తాం, ఏడాదికి రెండు కోట్లు ఉద్యగాలిస్తాం, నల్లధనం వెనక్కి తెచ్చి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాల్లో 15 లక్షల రూపాయలు జమచేస్తాం, స్వామి నాథన్ కమీషన్ సిఫారసులు అమలు చేసి రైతులను ఆదుకుంటామని ప్రగల్భాలు పలికిన మోడీ ఇవేవీ అమలు చేయకుండా రాముని పేరుతో రాజకీయాలు చేస్తూ దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నా రన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ మెడలు వంచి ఏపీకి ప్రత్యేక హెూదా సాధిస్తాను, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు తెస్తానని, రాష్ట్ర విభజన హామీలు అమలు చేయించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని పెద్ద ఎత్తున వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ఏఒక్కటీ సాధించకుండా కుండా బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తూ ఏపీ ప్రజలకు తీరని ద్రోహం చేశారన్నారు. అధికారమే పరమావధిగా రాజకీయాలు చేస్తూ రాష్ట్ర ప్రజలను వంచనకు గురి చేస్తున్న వైసీపీ, తెలుగు దేశం,జనసేన, బీజేపీ పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని భీమారావు కోరారు.

మతసామరస్యం, రాజ్యాంగ పరిరక్షణ, ఏపీకి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలుకు, అధిక ధరలు నియంత్రించాలని, రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ఉద్యమిస్తున్న వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలతో కూడిన ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. సీపీఐ నాయకుడు పెనుగంటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, గణపవరం శాఖ సభ్యులు దాసరి సుబ్బారావు, యాళ్ళ నాగేశ్వరరావు, తాడేల శ్రీనివాసరావు, అడపా పెద్దిరాజు,బొమ్మిడి వెంకటరమణ,కొటకల సురేష్, ఘంటసాల శ్రీను,వంక శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు పటిష్ఠ ప్రణాళిక

విశాలాంధ్ర, నరసాపురం: నియోజకవర్గంలో త్రాగునీరు, సాగునీరు సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ ముదునూరి ప్రసాదరాజు సంబంధిత శాఖల అధికారులును ఆదేశించారు. ఆదివారం తమ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో ఎక్కడ మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. మార్చి నెల ఆఖరు నాటికి మంచినీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపాలన్నారు. ఫిల్టర్ బెడ్లు మరమ్మతులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం జలజీవన్ మిషన్ నిధులు ద్వారా పూర్తి అయిన పనులును వినియోగంలోకి తేవాలన్నారు. ఇరిగేషన్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మంచినీటి సరఫరాలో ఎక్కడ ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయో నివేదిక తయారు చేసుకోని పరిష్కార చర్యలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్వచ్ఛమైన మంచినీరు అందించే ధ్యేయంగా పనిచేయాలన్నారు. మారుమూల గ్రామాల ఆవాసాలకు ప్రతిరోజు నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. పైపులైన్లు పగిలిపోయిన లీకైన వెంటనే వాటిని సరిదిద్ది నీటి సరఫరా అదే రోజు పునరుద్ధించాలని ఈ విషయంలో ఎటువంటి ఆలస్యము ఉండకూడదని అధికారులు ఆయన ఆదేశించారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. నరసాపురం మొగల్తూరు మండలాల్లో దాళ్వా సాగుకు సంబంధించి శివారు ప్రాంతాల వరకు పంట భూములకు నీటి కొరత లేకుండా ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక చంద్ర వహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రైతుల నుండి ఎటు ఫిర్యాదులు రాకూడదని ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బొక్క రాధాకృష్ణ, ఆర్ డబ్ల్యు ఎస్ డీ ఈ పి. శ్రీనివాస్, ఏ ఈ ఈ లు టి. లోకేష్, యు. రవిరాజు ఇరిగేషన్ ఏఈ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో వైసీపీ దందా'

విశాలాంధ్ర -తణుకు: ఇళ్ల స్థలాల పంపిణీ పేరుతో వైసిపి నేతలు దందా చేశారని తణుకు మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ తెలుగు దేశం జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో జగనన్న కాలనీల పేరు చెప్పి వైసిపి నేతలు ప్రజల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, ఇళ్ల స్థలాల దోపిడీకి సంబంధించిన లెక్కలతో సహా వైసీపీ దొంగను ఆయన విమర్శించారు. స్థానిక తెదేపా కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆరిమిల్లి మాట్లాడారు. తణుకు నియోజవర్గంలో రెండుసార్లు పాదయాత్ర చేయగలిగే అవకాశం దక్కినందుకు కృతజ్ఞుణ్ణి అని ఆరిమిల్లి అన్నారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత తణుకు పట్టణంలో మాస్టర్ ప్లాన్ పెట్టుకొని రోడ్లను విస్తరించడం, పట్టణాన్ని సుందరీకరించడం ప్రజల పనులు చేసినట్లు గుర్తు చేశారు. ఐదేళ్ల తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మూడుసార్లు తనకు నియోజవర్గం నెంబర్ వన్ స్థానంలో నిలిపానన్నారు. వైసీపీ పాలనలో నాసిరకం రోడ్లు వేశారని, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో విఫలమైందని ఆరిమిల్లి విమర్శించారు. వైసీపీ పాలనలో ప్రజలు దిక్కుతోచని విధంగా అయమయంలో ఉన్నారని, ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం గద్దె దింపి ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. . రానున్న రోజుల్లో తెలుగుదేశం జనసేన జెండాను ఎగరవేసి మరోసారి 2014 ఫలితాన్ని ప్రభావితం చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దొమ్మేటి వెంకట సుధాకర్, పశ్చిమగోదావరి జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, తణుకు మండల అధ్యక్షులు పితాని మోహన్, అత్తిలి అధ్యక్షులు ఆనాల ఆదినారాయణ , తనకు నియోజవర్గం బీసీ సెల్ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండేటి శివ, తోట సూర్యనారాయణ ఓమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, తామరపు రమణమ్మ, మల్లిన రాధాకృష్ణ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా బూరుబోయిన

విశాలాంధ్ర - కైకలూరు : అఖిల భారతీయ యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన అధ్యక్షులుగా బూరుబోయిన శ్రీని వాసరావు ని నియమిస్తూ అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఈ సందర్భముగా బూరుబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా అఖిల భారతీయ యాదవ మహాసభకు సహాయ సహకారాలు అందించి, యాదవ హక్కుల కోసం పనిచేశనని రాష్ట్ర స్థాయిలోను అనేక యాదవ సమ్యలపై పనిచేస్తూ,సంఘాన్ని పటిష్ట పరుస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించనని తెలిపారు. యాదవ సంఘ నిర్మాణాన్ని మరింత పటిష్టపరచి, విస్తృత పర్చేందుకు సంఘీయుల మధ్య మరింత ఐక్యతను పెంపొందిస్తానని, అఖిల భారతీయ యాదవ మహాసభ అభివృద్ధి కోసం కృషి చేస్తానని నన్నారు.ఎన్నికైన సందర్భముగా పలువురు బి ఏ ఎస్ ఆర్ ను అభినంచారు.

19 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-టీ నరసాపురం: అక్రమంగా రేషన్ బియ్యాన్ని కలిగి వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లుగా విజిలెన్స్ ఎస్ ఐ రంజిత్ కుమార్ తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వచేసారనే సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడి చేసి 19 క్వింటాళ్లు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 11వ నెంబరు దుకాణానికి తరలించినట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు చారిత్రాత్మకం

విశాలాంధ్ర-తణుకు : పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే కాకుండా ఒక ఆస్థి రూపంలో రిజిస్ట్రేషన్ పత్రాలను అందించడం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారులు శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఇంటిస్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ దాక్యుమెంట్స్ ను లబ్దిదారులకు మంత్రి కారుమూరి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో హామీ ఇచ్చినట్లుగా అర్హులైన పేదలకు సొంతింటిని నిర్మాణం చేసి ఇవ్వడంతోపాటు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారని స్పష్టం చేశారు. గతంలో ఏ ప్రభుత్వంలోనైనా కేవలం పట్టాలను మాత్రమే ఇచ్చేవారని కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రం ఏకంగా రిజిస్ట్రేషన్ దాక్యుమెంట్లు అందచేసి చరిత్రలో నిలిచారని అన్నారు. ఇంటి స్థలాల పంపిణీ విషయంలో ఓర్వలేకపోయిన టీడీపీ నాయకులు నానా యాగీ చేశారని, కానీ ప్రజల నుంచి కూడా తిరుగుబాటు రావడంతో తోకముడిచారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ. పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పాట్ల సురేష్, రేలంగి, కొమరవరం సర్పంచ్లు చేబ్రోలు స్వరాజ్యం, కరిబండి రాజేష్, తణుకు పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు పిల్లి సూరిబాబు, ద్వారకాతిరుమల దేవస్థానం కమిటీ మాజీ సభ్యులు కంకటాల సతీష్, తణుకు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు ఫహీమా పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారంపై రైతుల హర్షం

విశాలాంధ్ర, మొగల్తూరు: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న కాళీపట్నం భూ సమస్యకు స్థానిక ఎమ్మెల్యే శాశ్వత పరిష్కారం చేయడం అభినందనీయమని కాళీపట్నం రైతులు తెలిపారు. ఆదివారం దారితప్ప గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు, స్థానిక ప్రతినిధులు మాట్లాడారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కాళీపట్నం భూ సమస్య పరిషారానికి జివో 1558 ఇచ్చారన్నారు. ఆసమయంలో తమ గ్రామానికి చెందిన ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అనే బినామీ సంస్థ తరపున ఒకరు కోర్టును ఆశ్రయించడంతో ఈ జివోపై స్టే వచ్చిందన్నారు. నాటి నుండి తమ సమస్యను ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. గత ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు ఇచ్చిన హామీకి అనుగుణంగా ఈసమస్య శాశ్వత పరిష్కారానికి గత జివో 1558ని ఉపసంహరించుకుని జివో 7ను విడుదల చేయడంతో విచారణ చేసిన అధికారులు త మకు శాశ్వత భూహక్కు కల్పిస్తున్నారన్నారు. ఈనెల 3న పది మంది రైతులకు పట్టాలు ఇచ్చార ని మిగిలిన రైతులందరికీ సాగు చేసుకుంటున్న ప్రతీ సెంటు భూమి నష్టపోకుండా హక్కు పత్రా లు ఇచ్చేందుకు ప్రసాదరాజు కృషి చేస్తున్నారని ఇందుకు కాళీపట్నం రెవెన్యూ పరిధి 5 గ్రామలకు ఈసమస్య శాశ్వత పరిష్కారానికి గత జివో 1558ని ఉపసంహరించుకుని జివో 7ను విడుదల చేయడంతో విచారణ చేసిన అధికారులు త మకు శాశ్వత భూహక్కు కల్పిస్తున్నారన్నారు. జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, సొసైటీ చైర్మన్లు మోటుపల్లి రామభాస్కరరావు, దొంగ నాగముని, రైతులు సరిపల్లి సుబ్బరాజు, తణుకుల వెంకన్న, కవురు పెద్దిరాజు, మారుబోయిన అప్పారావు, కొప్పాడి గుణ్ణయ్య, రామాని మహేష్, అడ్డాల శ్రీను, దొంగ మురళీ, కోడి మధన్, సర్పంచ్లు పడవల సత్యనారాయణ, సరిపల్లి జ్యోతిప్రసాదరాజు పాల్గొన్నారు.

రోడ్లే లేవు... గుంతలు ఎలా పూడుస్తారు?



విశాలాంధ్ర - లింగపాలెం : రోడ్లే లేవు... ప్యాచ్ వర్కులు చేయాలని దాదాపు రూ. 50 లక్షలు ఇచ్చారు. రోడ్లు లేని చోట ప్యాచ్ వర్కులు చేసేదెట్లా అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మిచౌంగ్ తుఫాను వల్ల లింగపాలెం మండలంలో రహదారులు దెబ్బతిన్నాయని, వీటికి మరమ్మతులు చేయాలని నిధులు మంజూరు చేశారు. రోడ్లు దెబ్బతిన్నది వాస్తవమేకాని అయితే రోడ్లే లేవు వీటికి మరమ్మయతులు ఎలా చేస్తారు. పదేళ్ళకు ముందు నుంచే లింగపాలెం మండలంలోని గ్రామాలకు వెళ్ళే లింకు రహదారులు దెబ్బతిన్నాయి. ఒకప్పుడు తారుతో వేసిన ఈ రోడ్ల రూపే మారింది. తారు రోడ్లు స్థానంలో గోతులు పడిన మట్టి రోడ్డు దర్శనమిస్తున్నాయి. మిచౌంగ్ తుఫానుకు ఇచ్చిన నిధులతో గుంతలు పడిన రోడ్లను గ్రావెల్‌తోగాని, మెటల్‌తోగాని పూడ్చకూడదు. తారుతోనే గుంతలు పూడ్చాలి. తారులేని రోడ్లను తారుతో ఎలా పూడ్చాలని సంబంధిత శాఖల అధికారులే అంటున్నారు. మండలంలోని 50 కిలోమీటర్ల మేర ప్యాచ్ వర్క్ చేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాలను ఎలా అమలు చేస్తారు. రహదారుల మరమ్మతులపై ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో చర్చ జరిగింది. రోడ్లను పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్యంలో అనుభవాలు భవిష్యత్తుకు పునాది

విశాలాంధ్ర - లింగపాలెం : బాల్య దశలో ఉన్న అనుభవాలు భవిష్యత్తులో విద్యార్థులకు మేలు చేస్తాయని పలువురు పేర్కొన్నారు. ధర్మాజీగూడెం శ్రీవిద్య ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య దశలో విద్యార్థుల మధ్య ఎటువంటి భేదాలు ఉండవని అన్నారు. ఇటువంటి విద్యా విధానాన్ని జీవితంలో నిలబెట్టుకోవాలని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు పొందుతారని తెలిపారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. తమ అనుభవాలను పంచుకున్నారు. కరస్పాండెంట్ సాయి సునంద, ప్రిన్సిపాల్ రత్నాకర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కలలకు రెక్కలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర -భీమవరం: ఆడబిడ్డల చదువులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా కలలకు రెక్కలు అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు జిల్లా టిడిపి అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. భీమవరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన టీడీపీ జనసేన వీరమహిళల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెదేపా జనసేన అధినేతలు చంద్రబాబు పవన్ కళ్యాణ్ కలలకు రెక్కలు నూతన పథకాన్ని ప్రవేశ పెట్టనున్నారని రానున్న ఎన్నికల ద్వారా బిజెపి టిడిపి జనసేన పార్టీల ప్రభుత్వం ఏర్పడి నాటి నుండే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినుల ఉన్నత చదువులకు ఊతం ఇచ్చేందుకు కలలకు రెక్కలు పథకం ఉపయోగపడుతుందని తెదేపా జనసేన వీర మహిళలు ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం నిర్వహించాలని కోరారు. జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు డాక్టర్ సిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కలలకు రెక్కలు పథకం ఇంటర్ పాసైన విద్యార్థినులు ప్రొఫెషనల్ కోర్సులు నేర్చుకునేందుకు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకులు ఆర్థిక రుణం అందిస్తాయని విద్యార్థులు పొందే రుణానికి వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. డ్వాక్రా అంగన్వాడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ మాట్లాడుతూ కలలు రెక్కలు పథకం కావలసినవారు ముందుగా ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలని తెదేపా బీజేపీ జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే దరఖాస్తుదారులందరికీ రుణ సహాయాన్ని అందించడం జరుగుతుందని విద్యార్థినిలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు మాదాసు కనకదుర్గ, ఎండి షబీనా, సయ్యద్ నాసిమా బేగం, రొంగల కృష్ణవేణి, ఉప్పలపాటి లక్ష్మి, గొంతెన వెంకటరమణ, పైలా ఉమామహేశ్వరి, గంధం రాధా, జనసేన వీర మహిళలు బి.శ్యామల, కె.పావని, సిహెచ్ ప్రవల్లిక, సిహెచ్ ప్రతిభ, వి.పూర్ణిమ, వి.వి.డి మాలిక, ఎస్.కల్పన, డి.విజయ సావిత్రి వి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

మన్యం బంద్ ప్రశాంతం

విశాలాంధ్ర - వేలేరుపాడు : గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మన్యం బంద్ ఆదివారం మండలంలో విజయవంతంగా ముగిసింది. ఏజెన్సీ ప్రాంతాలలో వంద శాతం ఉద్యోగాలు, ఉపాధి కల్పన ఆదివాసీలకే కల్పించాలని డిమాండ్ చేస్తూ మన్యం బంద్ నిర్వహించారు. మండలంలోని దుకాణాలు, హెూటల్స్, ఇతర వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ కార్యాలయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించి మద్దతు తెలిపారు. బంద్ కు సంపూర్ణంగా మద్దతు పలికిన మండల ప్రజలకు, వ్యాపారస్తులకు, ఇతర రంగాల వారికి ఆదివాసి సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారం కావాలంటే రాజకీయంగా ఎదగాలి

దళిత ఆత్మీయ సమావేశంలో బొడ్డు నోబుల్

విశాలాంధ్ర- కైకలూరు: గత 13 ఏళ్లుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీ లో పని చేస్తున్నా తనకు గుర్తింపు లేదని తన సామాజిక వర్గానికి న్యాయం చేయలేకపోయానని మీ అందరి నిర్ణయం మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బొడ్డు నోబుల్ తెలిపారు. కైకలూరు పట్టణంలోని సిఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటుచేసిన దళిత ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా బొడ్డు నోబుల్ నివాసం నుండి తాలూకా సెంటర్ వరకు 500 మంది బైక్ ర్యాలీ గా తరలివచ్చి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జై భీమ్ అంటూ నినాదాలు చేశారు. అక్కడ నుండి సభా ప్రాంగణం వరకు ర్యాలీగా డీజే స్టెప్పులతో బాణ సంచాలతో తరలి వెళ్లారు. ఈ సందర్భముగా బొడ్డు నోబుల్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో 50 వేల ఓట్లు కలిగి దళిత ఆత్మీయ ఉన్న దళితులు వివక్షతకు గురవుతున్నారన్నారు. దళితులకు అధికారం కావాలంటే ముందు రాజకీయ శక్తిగా ఎదగాలన్నారు. స్థానిక శాసనసభ్యులు ఒక సభలో వార్డు సభ్యుడుగా గెలవలేని వ్యక్తిని రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా ఎంపిక చేశానని దుర్భాషలాడినట్లు ఒక ఆడియో విడుదల చేశారు. అప్పటికే నేను ఎంపీటీసీ గా గెలిచానన్న విషయం మరచి మాట్లాడటం దళితులను చిన్న చూపు చూస్తున్నారని అనడంలో అతిశయోక్తి లేదు అన్నారు. నియోజక వర్గంలో దళితుల ఓట్లు 50 వెలు వున్నాయని అధికార మదంతో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరావు ఇలా మాట్లాడటం అన్యాయం అని అన్నారు. దళితులంతా ఐకమత్యంగా ఉండి ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. మీరందరూ తన వెనుక వుంటే తాను ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్ని పార్టీలు సీట్లు కేటాయించిన అనంతరం తాను ప్రకటిస్తానని పేర్కొన్నారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

విశాలాంధ్ర, మండవల్లి: ఎన్నికల సందర్భంగా గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ హెచ్చరించారు. ఆదివారం కైకలూరు రూరల్ సీఐ కృష్ణ కుమార్, మండవల్లి ఎస్ఐ రామ చంద్ర రావు, సిబ్బంది భైరవ పట్నం,మనుగునూరు,అయ్యవారి రుద్రవరం, మండవల్లి, కానుకొల్లు గ్రామములలో రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్, సాయుధ దళాల తో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ రానున్నఎన్నికలలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించు కొనుటకు పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నారని ప్రజలకు భరోసా కల్పించినారు. పచ్చని గ్రామాలలో ఏ విధమైన వైషమ్యాలు లేకుండా మీకు నచ్చినటువంటి రాజకీయ పార్టీలకు ఓటు వేసుకునే లాగా ప్రతి ఒక్కరు ఒకరికి ఒకరు సహకరించాలని, ఏ విధమైన సమస్యలను సృష్టించ రాదని కోరారు. రాజకీయ పార్టీలపై ఉన్న అభిమానంతో ఎదుటి పార్టీల వారిని దూషించ రాదని,ఎన్నికల నేపథ్యంలో ఎదుటివారి ఓటును వినియో గించుకునే విషయాలలో ఆటంకాలను సృష్టించ రాదన్నారు. ఫలానా పార్టీ వారికి ఓటు వేయాలని ప్రలోభాలకు గురి చేయరాదని హెచ్చరించారు.

చీకట్లోనే బరియల్ కార్యక్రమం

విశాలాంధ్ర - నల్లజర్ల : నల్లజర్ల మండలం నవీపేట గ్రామానికి అతి సమీపంలో బరియల్ గ్రౌండ్ ఉన్నది. దారి పొడవునా బరియల్ గ్రౌండ్కు కరెంటు లేక చీకట్లోనే బరియల్ కార్యక్రమం చేయవలసి వస్తుంది. ప్రజలు కార్యక్రమం సాయంత్రం చేయాలంటే చుట్టుపక్కల అంతా కూడా చీకటి మయం ఎప్పుడూ ఏ విషపురుగు బయటకు వస్తుందో తెలియనటువంటి పరిస్థితి అట్లాంటి పరిస్థితుల్లోనే ఎవరైనా గ్రామంలో మరణిస్తే ఆ చీకట్లోనే బరియల్ కార్యక్రమం చేయవలసి వస్తుంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దీనిపై స్పందించి గ్రామమునకు ఆనుకొని ఉన్నటువంటి బరియల్ గ్రౌండ్కు అతి సమీపంలోనే ఉన్నది కనుక దారి పొడవున కరెంటు ఏర్పాటు చేయాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు. కనీసం నీరు సదుపాయం లేదని, దానికి ఒక ఫినిషింగ్ లేదు వెంటనే అధికారులు స్పందించి ఎప్పటినుంచో మిగిలిపోయినటువంటి ఆ కలను సాకారం చేయవలసిందిగా కోరుచున్నారు. రాత్రిపూట బరియల్ కార్యక్రమం చేయాలంటే చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది అట్లాంటి ఇబ్బందుల్లోనే చీకట్లోనే బరైల కార్యక్రమం చేయడం జరిగింది కనుక దీనిని అధికారులు గ్రామ పెద్దలు ప్రతి ఒక్కరు కూడా గమనించి త్వరితగతిన కరెంటు స్తంభాలు వేయాలని మనవి

మండలంలో పోలీసు కవాతు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలంలో దేవరపల్లి యాదవోలు త్యాజంపూడి గ్రామాలలో రాబోవు అసెంబ్లీ లోక్సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొవ్వూరు డీఎస్పీ రామారావు ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు దేవరపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం కొవ్వూరు డీఎస్పీ కెసిహెచ్ రామారావు దేవరపల్లి సిఐ బాలసురేష్ ఎస్ఐ శ్రీహరి రాములు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుండి సిఎస్ఎఫ్ కవాతుతో దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు డీఎస్పీ సిహెచ్ రామారావు మాట్లాడుతూ రాబోవు లోక్సభ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేందుకు ఈ కవాతు ద్వారా తెలియ జేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఓటరు నిర్భయంగా తన ఓటు హక్కును వినియోగించు కోవాలని ఆయన కోరారు కొవ్వూరు నిడదవోలు గోపాలపురం నియోజకవర్గాలలో ప్రధాన గ్రామాలలో సిఎస్ఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలుకు డైమండ్ అవార్డు

విశాలాంధ్ర - నిడదవోలు : రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు క్లబ్ పోలియో నిర్మూలనకు కృషి చేసినందుకు కీర్తి ఆంజనేయులును రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 పాలకొల్లులో జరిగిన సంరక్షణపోలియో నిర్మూలన కార్యక్రమం లో డైమండ్ అవార్డుతో సత్కరించినట్లు కీర్తి ఆంజనేయులు తెలిపారు. ఆదివారం జరిగిన సెమినార్లో కీర్తి ఆంజనేయులు పోలియో నిర్మూలనా కార్యక్రమాల అమలు, అవగాహన, రోటరీ ఇంటర్నేషనల్కు సేకరించిన పోలియో ఫండ్ విరాళాలను జమ చేయడంలో చూపిన శ్రద్ధకు గుర్తింపుగా ప్రత్యేక అరుదైన డైమండ్ అవార్డ్ తో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు అధ్యక్షులు కీర్తి ఆంజనేయులుని సత్కరించడం జరిగిందన్నారు.రోటరీ క్లబ్ నిడదవోలు అధ్యక్షులు కీర్తి ఆంజనేయులు ను రోటరీ డిస్ట్రిక్ట్ 30 20 గవర్నర్ రొటేరియన్ రావూరిసుబ్బారావు, పాస్ట్ డిస్ట్రిక్టు గవర్నర్ భరత్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును పొందడం పట్ల కీర్తి ఆంజనేయు లును మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ,రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాస్, రొటేరియన్ కొత్తపల్లి నాగేశ్వరరావు, గున్నాబత్తుల రామారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఖండవిల్లి రంగాచార్యులు, పొన్నాసుబ్రహ్మణ్యం తదితరులు అభినందనలు తెలిపారు

రైల్వే బ్రిడ్జి వెంటనే నిర్మించాలి



విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం ఉప్పాడ రైల్వే గేట్ వద్ద జనసేన పార్టీ ఇన్చార్జి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జనసేన నాయకులు చెల్లుబోయిన సతీష్, ఆ పార్టీ శ్రేణులతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన సతీష్ మాట్లాడుతూ రైల్వే గేటు వద్ద ఉన్న ఏడు దశాబ్దాలనాటి ఏలేరు వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆ రైల్వే గేట్ నుండి సుమారు 40 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని ప్రమాదకరంగా ఉన్న వంతెన పై స్కూల్ పిల్లలు, ఆసుపత్రికి వెళ్ళవచ్చు రోగులు ఇటువైపు ప్రయాణం చేయాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధి చేసిందని గొప్పలు చెప్తుంది తప్పప్రజా సమస్యలు గాలికి వదిలేసిందని తెలుసు కోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం మేల్కొని రైల్వే ఓవర్ బ్రిడ్జిను త్వరగతిన నిర్మించాలని కోరారు.

ఎఎస్ఆర్నగర వాసుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర- టి నరసాపురం : అల్లూరి సీతారామరాజు నగర్వాసుల సమస్యలు పరిష్కరిం చాలని జనసేన పోలవరం నియోజకవర్గం ఇంచార్జ్ చిర్రి బాలరాజు డిమాండ్ చేశారు. శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాన్ని స్థానిక టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు కాస ననేని వెంకట్రావు టీడీపీ నాయకులు కార్యకర్తలను కలిసి మద్దతు కోరారు. ఈ పర్యటనలో భాగంగా మండలంలోని ఎఎస్ఆర్ నగర్ వాసులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 10ఏళ్ళుగా స్థానికంగా గుడిసెలు వేసుకుని నివాసుముం టున్నామని, కరెంటు, త్రాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని పలు మార్లు అధికారులు పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎఎస్ఆర్ నగర్ వాసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు అడప నాగరాజు, జీలుగుమిల్లి మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కొయ్యల గూడెం మండల అధ్యక్షులు తోట రవి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

విశాలాంధ్ర- టి నరసాపురం: పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుక్కునూరు మండలం దాచారం గ్రామానికి చెందిన వర్షా లక్ష్మి,సుబ్బయ్య దంపతులు గత 20 సంవత్సరాలుగా టి నరసాపురం మండలం శ్రీరామవరం గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఎప్పటి మాదిరిగానే లక్ష్మి ఈ నెల 9వ తేదీన ఉదయం శ్రీరామవరం గ్రామానికి చెందిన కాల్నీడి లక్ష్మణరావు జీడితోటలోకి చెట్ల కింద ఆకుల శుభ్రం చేయ దానికి పనికి వెళ్ళగా సాయంత్రం నాలుగున్నర గంటలకు సమయంలో రక్త పింజర పాము కాటు వేయడంతో వెంటనే చింతలపూడి ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి చనిపోయినట్లు తెలిపారు. మృతిరాలు భర్త సుబ్బయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ దుర్గామహేశ్వర రావు తెలిపారు.

నిడదవోలు అభ్యర్థిగా శేషారావునే ప్రకటించాలి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం : రానున్న సార్వత్రిక ఎన్నికలలో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావును తప్పనిసరిగా ప్రకటించాలని ఆదివారం కాల్దారిలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండలానికి చెందిన టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వరకు కొవ్వొత్తులు చేతబట్టి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం మండలం టీడీపీ అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ మాట్లాడుతూ జనసేన, టీడీపీ సంయుక్తంగా విడుదల చేసిన తొలి జాబితాలో శేషారావు పేరు లేకపోవడం, తదనంతరం సోషల్ మీడియాలో పలు ఊహగానాలు చెలరేగడం నియోజవర్గ ప్రజలకు అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. తదుపరి విడుదల చేసే జాబితాలో తప్పనిసరిగా శేషారావు పేరును ప్రకటించాలని తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలను కోరారు. పార్టీకి, అధిష్టానానికి విధేయుడుగా నడుచుకుంటూ, నియోజకవర్గ ప్రజలందరికీ అందుబా టులో ఉండే వ్యక్తి శేషారావని ఆయనకే సీటును కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేలివెన్ను, కాల్దారి గ్రామాల అత్తిలి సత్యనారాయణ, చీపుళ్ళ కుమారి, ఈర్పిన సత్య నారాయణ, వేముల వెంకట సత్యనారాయణ, రాచమళ్ళ శ్రీను, మండల టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీలోకి 50 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని జె అన్నవరం గ్రామంలో సుమారు 50 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రతిపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వైసీపీ పాలనలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్దిని వివరించారు. సుమారు 50 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వరుపుల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి జగన్మోహన్ రెడ్డికి ఆదరణ పెరిగిందని అన్నారు. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ ముఖ్యమంత్రి ఇవ్వలేని విధంగా ఆదివాసీలకు కొండపోడు భూముల పట్టాలను ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కంటే దక్కుతుందని ఆయన అన్నారు. ఈ పట్టాలు ఇవ్వడం ప్రారంభించి సుమారు రెండు సంవత్సరాలు కాలంలో అర్హులైన అందరికీ ఇవ్వడం జరిగిందని, ఇంకా టెక్నికల్ ఇష్యూ వల్ల కొంతమందికి పట్టాలు ఇవ్వలేదని వారికి కూడా త్వరలోనే పట్టాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. జె అన్నవరం, పరిమితడక గ్రామాలలో త్వరలో గ్రామసభ నిర్వహించి భూములు సర్వే చేయించి ఇచ్చే విధంగా చర్యలు చేపడతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కే వీరంశెట్టి, ఎంపీటీసీ కళారి సత్తిబాబు, ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్ జువ్విన వీర్రాజు, వెంకటేశ్వరరావు, తిరుమాలి సర్పంచ్ సూతి ప్రసాద్, సి రాయవరం సర్పంచ్ గుమ్ములూరు వెంకటరమణ, తదితర సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళులు

విశాలాంధ్ర - తణుకు : చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జీవన విధానం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారులు శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సావిత్రి బాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆమె విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీవిద్య ప్రాధాన్యతను మహిళా లోకానికి తెలిపి మహిళలను విద్యబాట పట్టేలా చేసిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అన్నారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ విద్యతోనే మహిళలు అభివృద్ధి చెందుతారనే విషయాన్ని లోకానికి చాటిచెప్పిన మహనీయురాలు సావిత్రి బాయి పూలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షులు చినిమిల్లి వెంకటరాయుడు, తణుకు బీసీ సెల్ అధ్యక్షులు పిల్లి సూరిబాబు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు పొట్ల సురేష్, కుడుపూటి చంద్రరావు, గెద్దాడ శ్రీకాంత్, సిహాద్రి, చింతన్న, కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.

ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు అయ్యంకి సురేష్ బాబు, కార్య దర్శి సయ్యద్ లాల్ సాహెబ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో" వాసవ్యా మహిళా మండలి, సమా వేశ మందిరంలో" భారతీయ చట్టల ప్రచార స్వచ్ఛంద సంస్థ లోగో" రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథులుగా, బి . రాజకుమారి, ఐ.పి.యస్, ఎ.పి.యస్. పిడిఐజి. వాసవి మహిళా మండలి ప్రెసిడెంట్ డా" బి.కీర్తి, డా" రష్మి , పాల్గొని దిశ చట్టం, నిర్భయ చట్టం, మహిళ గృహహింస నిరోధక చట్టలపై వివరించారు. అనంతరం అతిథులకు, మహిళా సామాజిక కార్యకర్తలు, అయ్యంకి లక్ష్మి, సయ్యద్ మున్నేరు బేగం లాల్ సాహెబ్, డా" శ్రావణి, కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులైన, డా" కీర్తి, బి. రాజకుమారి, ఐ. పి.యస్, డా" రష్మి, అతిధులను సత్కరించారు. కుటుంబ అభివృద్ధికి సమాజ శ్రేయస్సు కొరకు కృషి చేస్తున్న మహిళామూర్తులను, ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులను డా" బి. కీర్తి, రాజకుమారి, ఐ. పి. యస్. చేతుల మీదుగా, మున్నీర్ బేగం, అయ్యంకి లక్ష్మి, నార్ల మాలతి, పోలే శాంతి, కాట్రు ప్రశాంతి, వేమూరి కృష్ణ, మారటి లక్ష్మీ లావణ్య, వేముల విజయ కృష్ణ, సింహాద్రి మాధురి కృష్ణ , శ్రీవాణి, పలు రంగాలలో రాష్ట్రవ్యాప్తంగా ముందుకు సాగుతున్న డెభై మంది మహిళలకు, ఉత్తమ మహిళ సేవారత్న అవార్డ్స్ ,30 మంది పురుషులకు సేవా రత్న అవార్డ్స్, సర్టికెట్లతో" చిరు సత్కారం చేసినట్లు, అయ్యంకి సురేష్ బాబు తెలియజేశారు.

ప్రజలను మభ్య పెట్టేందుకే శంకుస్థాపనలు

విశాలాంధ్ర -నూజివీడు : ప్రజలను మభ్య పెట్టేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తెరతీశారని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య ఆరోపించారు. ఆదివారం చిన్నం రామకోటయ్య తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఏర్పాటుచేశారు. పది రోజుల నుంచి స్థానిక ఎమ్మెల్యే గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన అంటూ శిలాఫలకాలు వేస్తూ వెళ్తున్నారని, ప్రభుత్వం వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తుంటే అభివృద్ధి ఎన్నికల ముందు గుర్తు వచ్చిందంటూ విమర్శించారు. ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే శంకుస్థాపన చేసిన పనులను వెంటనే ప్రారంభించేలా చూడాలని చిన్నం కోరారు.

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ముఖరం

విశాలాంధ్ర - మామిడికుదురు : తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా హాజీ ముక్రం హుస్సేన్ను నియమించడం పట్ల పార్టీ శ్రేణులు, హుస్సేన్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులకు నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేస్తూ నగరం టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు జాలెం సుబ్బారావు ఇంటి వద్ద హుస్సేన్కి సన్మాన సభ ఏర్పాటు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుంది అని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల శాఖ అధ్యక్షులు జాలెం శ్రీనివాస్ రాజా, నగరం గ్రామ సర్పంచ్ జాలెం రమణకుమారి, షేక్ సుభాన్, అబ్రార్ హుస్సేన్, ఎంకే అబ్బాస్, మీర్ కరమలి, ఇలియాస్ హుస్సేన్, సర్కిల్ రజా అలీ, రాజాక్ అలీ, మొహమ్మద్ మీరా, కోళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓట్ హక్కు వినియోగించుకోండి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రతి ఓటరు ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కునేలా ప్రజలకు భరోసా కలిగిస్తూ, జరగనున్న ఎన్నికల దృష్ట్యా, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కొవ్వూరు డివిజన్ కు కేటాయించిన కేంద్ర సాయుధ బలగాల తో కొవ్వూరు డి.ఎస్.పి కె.సి.ఎచ్ రామారావు అద్వర్యం లో ప్రజలకు భరోసా కలిగిస్తూ తాళ్ళపూడి మండలం లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొవ్వూరు డి.ఎస్పీ రామారావు మాట్లాడుతూ, కొవ్వూరు డివిజన్ కు 360 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది కేటాయించారని, ప్రతి నియోజక వర్గం లోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు పోలీస్ శాఖ తరపునుంచి ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించు కునే మనస్థిర్యాన్ని కల్పిస్తున్నా మన్నారు. ఎక్కడైనా ఎన్నికల సందర్భంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు గురించి పిర్యాదు చేస్తే ఆ ప్రాంత ప్రజల కు పూర్తి రక్షణ మధ్య ఓటు హక్కు వినియోగించుకునేల తక్షణ చర్య తీసుకుంటామని తెలిపారు. కొవ్వూరు నిడదవోలు గోపాలపురం, నియజకవర్గాల లో రిజర్వ్ పోలీస్ బలగాలు సేవ లుంటాయని తెలిపారు. కొవ్వూరు సి.ఐ శ్రీనివాసరావు తాళ్ళపూడి ఎస్సై శ్యామ్ సుందర్, సిబ్బంది కవాతు లొ పాల్గొన్నారు.

హనుమత్ కళ్యాణం

విశాలాంధ్ర - జంగారెడ్డి గూడెం : మండలంలోని గురవాయిగూడెం గ్రామం లో వేంచేసియున్న శ్రీమద్ది ఆంజ నేయస్వామి వారి దేవస్థానము లో ఆదివారం ఆంజనేయ స్వామి వారి జన్మ నక్షత్రం పూర్వభాద్ర నక్షత్రం కావడంతో ఆలయ ప్రాకార మండపం లో శ్రీసువర్చుల హనుమత్ కళ్యాణము ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు, స్థానాచార్యులు ఆధ్వర్యములో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. జంగారెడ్డి గూడెం డీఎస్పీ రవిచంద్రన్ కుటుంబ సమేతంగా విచ్చేసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కీసరి సరిత విజయభాస్కరరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి కొండలరావు తెలియజేశారు.

గురునాథరావు చేరికతో వైసీపీ బలోపేతం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సీనియర్ నాయకులు అప్ లాండ్ ప్రాంతంలో ప్రతి ఒక్కరికి సుపరిచితులు జెట్టి గురునాథరావు కాంగ్రెస్ పార్టీ నుండి, వైయస్సార్ పార్టీలోకి రావడం పట్ల పార్టీ మరింత బలోపేతం అవుతుందని రాజవరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పాముల నాగ మునిస్వామి పేర్కొన్నారు. జెట్టి గురునాథరావును జంగారెడ్డిగూడెంలో ఆయన స్వగృహం వద్ద పంగిడిగూడెం, రాజవరం గ్రామాల వైఎస్ఆర్సిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని, ఆయన పార్టీలోకి రావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆయనను కలిసిన వారిలో కొప్పుల ప్రసాద్ రెడ్డి, రాచకొండనాగ నరసింహారావు, పంతెన సత్య వెంకట మురళీకృష్ణ,కంచర్ల సత్యనారాయణ, సిహెచ్ మంగరాజు ఉన్నారు.

బహుజన భేరిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఏలూరు : ఈ నెల 15న విజయవాడలో జరుగు బహుజన భేరిని జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి పరంజ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఏలూరు కొత్త రోడ్ల గల నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో బిఎస్పి జిల్లా అధ్యక్షుడు సిరా భరత్ అధ్యక్షతన ఏలూరు జిల్లా ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశం జరిగింది. బహుజన భేరీ కరపత్రాలను ఆవిష్కరించారు.బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరంజ్యోతి మాట్లాడుతూ బీసీ, ఎస్ సి, ఎస్ టి, క్రైస్తవ ,ముస్లిం, మైనారిటీల ఏకైక జాతీయ పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ జయంతి సందర్భంగా ఈనెల 15న విజయవాడ విద్యాధరపురం లోని మున్సిపల్ మైదానంలో బహుజన భేరి నిర్వహిస్తున్నామని ఈ బహుజన భేరి సభలో నేషనల్ కోఆర్డినేటర్ ఆకాష్ ఆనంద్ రాష్ట్ర ఇన్చార్జి, రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని కావున బహుజనలంతా వేలాదిగా తరలివచ్చి బహుజన భేరిని విజయవంతం చేయాలని కోరారు.బి.ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి నేతల రమేష్ బాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న బిఎస్పి అభ్యర్థులంతా గెలుపు దిశగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కలపాలా రాజ్ కుమార్, దేవరపల్లి రత్నబాబు, అందుగుల రత్నాకర్, భూపతి అప్పారావు, కొత్తల పూర్ణ, మల్లికార్జున్, చాట్ల శ్రీను, పోశుమణి, కర్రే అంబేద్కర్, బుంగా ఏసు, సిరయం వెంకటేశ్వరరావు, ఎల్.వి చైతన్య, కోదూరి రమేష్, కైకలూరు నాగేశ్వరరావు, నూజివీడు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో చింతలపూడి కి చెందిన ప్రముఖ న్యాయవాది ఎల్ వి చైతన్య తన అనుచరులతో కలిసి వచ్చి రాష్ట్ర అధ్యక్షులు బక్కా పరంజ్యోతి ఆధ్వర్యంలో బిఎస్పి పార్టీలో చేరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - నూజివీడు : నూజివీడు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నూజివీడు శాసనసభ్యులు మేక వెంకట్ ప్రతాప్ అప్పారావు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.మండలంలోని వెంకటాద్రి పురం, ఓగిరాల తండా,కొత్తూరు తండా యనమదల,బత్తుల వారి గూడెం గ్రామాల్లో సుమారు రెండు కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఇంటింటికి కొళాయి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష ఆయా గ్రామాల సర్పంచులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్యాయం పాటించండి

గెడ శ్రీరామచంద్రమూర్తి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెదేపార్టీలో బీసీలకు ఒక న్యాయం, అగ్రకులాల వారికి ఒక న్యాయమా అని తెదేపా కొయ్యలగూడెం పట్టణ సీనియర్ నాయకులు గెడ శ్రీరామచంద్రమూర్తి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నియోజకవర్గం బుట్టాయిగూడెం గ్రామంలో నాయకులు, కార్యకర్తలు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థికి సంబంధించి నియోజకవర్గ కన్వీనర్ కు పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు చరవాణి ద్వారా ఎమ్మెల్యే టికెట్ విషయమై అవసరమైతే త్యాగం చేయవలసి వస్తుందని , పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని పార్టీకి వ్యతిరేకంగా, అధినేత మాటలను పక్కకు పెట్టి ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారని శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. గతంలో లోకల్ పార్టీ లీడర్లను ఎమ్మెల్యే ఆశా వాహుల వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని నిలదీసినందుకు ముగ్గురు బీసీ కార్యకర్తలను సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేము సిద్ధం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : మేము సిద్ధం మాబూత్ సిద్ధం అనే కార్యక్రమాన్ని పక్కిలంక సచివాలయ పరిధిలోని ప్రకిలంక, పైడిమెట్ట గ్రామాల్లో బూత్ లెవెల్ కమిటీ నాయకులు ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను గురించి వివరించారు. ఒక్కొక్క లబ్ధిదారుడికి డి.బి.టి ద్వారా ఎంత లబ్ది చేకూరింది, నాన్ డి.బి.టీ ద్వారా ఎంతెంత నగదు చెల్లించారో వారికి వివరించారు. ప్రక్కిలంక పైడిమెట్ట రెండు గ్రామాలోను రేపు రాబోయే ఎన్నికలలో మన కొవ్వూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీ చేసే తలారి వెంకటరావు ను మరియు మన రాజమండ్రి పార్లమెంట్ కి ఎంపీ గా పోటీ చేసే డా.గూడూరు శ్రీనివాస్ ను ఫ్యాన్ గుర్తు మీద ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అలాగే మన సీఎం గా జగన్ ను మరల ముఖ్యమంత్రిగా చేయాలని ప్రచారం సాగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ , పార్టీ ఇంచార్జి జొన్నకూటి పోసిరాజు, కొవ్వూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ళ బాబురావు, ప్రకిలంక సచివాలయ కన్వీనర్ కొల్లి దుర్గారావు, పైడి మెట్ట బూత్ కన్వీనర్ వీర వెంకట సత్యనారాయణ అనే నాని , ప్రక్కిలంక బూత్ కన్వీనర్ రజనీ మండల జెసిఎస్ కన్వీనర్ ముళ్ళ పోసి బాబు, ఎం.ఎల్.ఓ ప్రక్కిలంక వార్డ్ మెంబర్స్, ఎంపీటీసీ, ప్రక్కిలంక పైడిమెట్ట వాలంటీర్స్, గృహసారథులు మరియు వైయస్సార్ నాయకులు, ఈ కార్యక్రమం లో హాజరయ్యారు.

4 వేల మందికి అన్నదానం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రక్కిలంక గ్రామంలో సౌరయాగం, సూర్య నమస్కారాలు ముగింపు సందర్భంగా ఆదివారం చేపట్టిన సూర్యనారాయణ మూర్తి ఉషా ఛాయా శాంతి కళ్యాణం అత్యంత ఘనంగా జరిగింది. గత నెల రోజులుగా నిత్యం సూర్యనమస్కారములు, సౌర యాగం, అభిషేకములు జరిగాయి. అర్చక బ్రహ్మ కౌతవరపు విశ్వనాధ్ శర్మ అద్వర్యం లో వేద పండితులు జరిపించినన ఈ కళ్యాణ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి అధిక సంఖ్య లో భక్తులు, ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్య లో పాల్గొని కళ్యాణో త్సవాన్ని తిలకించి భారీ అన్న దాన కార్యక్రమం లో పాల్గొన్నారు. సుమారు నాలుగు వేల మందికి అన్నదాన కార్యక్రమం చేశారు.

మహాశివరాత్రి మహోత్సవాలు ముగింపు

విశాలాంధ్ర - దేవరపల్లి: దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి సమేత దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివ రాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వై .సుజనా శర్మ ఆధ్వర్యంలో పల్లకి సేవ మరియు శ్రీ పుష్ప యోగం కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులు పీఠం మీద కూర్చుని కార్యక్రమాన్ని నిర్వహించినారు మరియు దంపతుల చే తాంబూలాల కార్యక్రమం నిర్వహించినారు మరియు భారీ అన్న సమరాధన కార్యక్రమం నిర్వహించినారు మరియు మండలంలో అన్ని గ్రామాల నుండి ప్రజలు భక్తులు విచ్చేసి స్వామివారి ని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు , అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు కూచిపూడి సతీష్, ఈదుపుగంటి శివరామ ప్రసాద్, మొక్కపాటి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ఎల్లమాటి చిన్న రామారావు, గన్నమణి సత్యప్రసాద్, కొయ్యలమూడి వేణు గోపాల్ కృష్ణ, కొయ్యలమూడి కాశి, కొయ్యలమూడి విశేష్ చౌదరి, వీరభద్ర తేజ, మద్దిపాటి శ్రీనివాసరావు, వల్లభనేని గాంధీ ప్రసాద్, తీగల సూర్యం, వల్లభనేని దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు సౌకర్యాల కొరత

విశాలాంధ్ర - పెనుమంట్ర: చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. అరకొర వసతులతో కేంద్రాలకు వచ్చే పిల్లలు నిత్యం ఇబ్బంది పడవలసిన దుస్థితి నెలకొంది. పెనుమంట్ర ప్రాజెక్టు పరిధిలో మార్టేరు సెక్టర్ సత్యవరం గ్రామం కోడ్ నెంబర్ - 33 అంగన్వాడి 2018వ సంవత్సరంలో రూ.8.50 లక్షలతో నిర్మించారు. సుమారు ఏడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటి వరకు కనీస మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్లు లేకపోవడం వల్ల అంగన్వాడీ సిబ్బందితోపాటు, అక్కడికి వచ్చిన గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఈ కేంద్రానికి చుట్టూ ప్రహరీ లేకపోవడం... ఈ కేంద్రానికి ఆనుకుని ప్రక్కనే చెరువు ఉండడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ఉంచుకొస్తుందోనని చిన్నారుల తల్లిదండ్రులు భయం భయంగా చిన్నారులను కేంద్రాలకు పంపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు కనీసం వసతులు కల్పించక పోగా అసలు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. మార్టేరు సెక్టర్ సూపర్వైజర్ పి. వరలక్ష్మిని వివరణ కోరగా నాడు - నేడు పథకంలో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని ఆమె తెలిపారు.

గిరిజనులకు ప్రత్యేకంగా డీఎస్సీ నిర్వహించాలి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించి, స్థానిక గిరిజనులకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు గిరిజన సంఘాలు ఆదివారం తలపెట్టిన ఏజెన్సీ బంద్ ప్రశాంతంగా జరిగింది.సీపీఐ,సీపీఎం, గిరిజన సంఘం నాయకులు ఉదయాన్నే బందులో పాల్గొని నిరసన తెలియ జేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ జీవో నెం.3 కు చట్టబద్ధత కల్పించి పటిష్టంగా అమలు చేసి గిరిజన చట్టాలను కాపాడాలని వారు నినాదాలు పలి కారు. స్థానిక బస్టాండ్ వద్ద బైఠాయించి రాకపోకలను నిలుపుదలు చేశారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

విశాలాంధ్ర - నరసాపురం : కుటుంబ విలువలు కాపాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు, కాపు వనితా క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ డా. రాజ్యలక్ష్మి శిరిగినీడి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపురం పట్టణంలోని అల్లూరి సత్య నారాయణ కళ్యాణ మండపంలో పారిశుద్ధ్య కార్మికురాలు అనితను సత్కరించారు. వనితా క్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమా మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుకు దూసుకు వెళ్తున్నార న్నారు. అనంతరం వనితా క్లబ్ సభ్యులందరినీ డా. రాజ్యలక్ష్మి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బండి స్వర్ణలత, కోశాధికారి రంగినీడి భరణి, ఉపాధ్యక్షురాలు ఉషాకమల, తోట భారతి, తోట అరుణ, వలవల సావిత్రి, చల్లా పద్మావతి, తాయారు, పద్మావతి, మణి, సుప్రజ, రాజ్యలక్ష్మి చంటి, తోటహేమలత పాల్గొన్నారు .

వ్యక్తి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర -ఏలూరు క్రైమ్ : తన మాట వినకుండా భార్య పనిలోకి వెళుతోందని మనస్థాపం చెందిన ఏలూరు మండలం, వెంకటాపురం పంచాయతీ ,శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన షేక్ జిలాని (50)అనే వ్యక్తి పురుగు మందు తాగాడు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జిలాని మృతిని అనుమానాస్పద కేసుగా నమోదు చేసి ఏలూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.